
# ప్రతీక్ష



**తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే నవలలేగాక, బలివాడ కథలు కూడా ఆధునిక మానవ జీవితంలోని సంక్లిష్టతను, వేదనను, రోదనను, ఉల్లాసవిలాసాలను, వెలుగు నీడలను సమగ్రంగా ప్రతిబింబిస్తాయి.**

ఉత్సాహంతో ఉరకలువేసే శివకుమార్ ఒక్కసారిగా అంతర్ముఖుడయ్యాడెందుకు? పట్టణశివార్లలో ఉన్న మూడంతస్తుల భవనంలో పైఅంతస్తులో దక్షిణం వేపుఉన్న భాగం. ఈ ఇంట్లో స్వగతంలో పడ్డాడు. అతని స్వగతాలు అతనే వింటూ కళ్లలోకదిలే నీటిని బయటకు జారవెయ్యలేక లోనికిపంపడానికి ప్రయత్నిస్తున్నాడు. ఒకే బిందువుపై తుపాకీ గురిని కేంద్రీకరించినట్లు తన అక్కసును ఒకే ప్రాణిమీద లగ్నంచేశాడు.

సాయంసమయంలో పడమటివేపునఉన్న బాల్కనీ లోనికి కుర్చీలాక్కుని కూర్చుని చూశాడు. ముఖం త్రిప్పితే దిగువ అంతస్తులో ఉత్తరం వేపున ఉన్న పోర్షనులో కిటికీనించి రెండు కళ్లు తెరిచి తనవేపు చూస్తున్నట్లు గమనించేడు. ఆ అమ్మాయి పెదిమల్లో నెలవంక దరహాసం కనిపించింది. తను ఈ ఇంట్లో దిగి కొద్దిరోజులే అయినా ఆ కిటికీ నించి తనవేపు ఇదివరకు ఎవరూ చూసినట్లు గుర్తులేదు. చప్పున ఆకళ్లు ఓ క్షణంలో మాయమయ్యాయి. మనసులో ఏదో ఉత్సాహంతో, తొలిసారి ఆ చూపు ప్రసరించడంతో రోడ్డుకు ఆవలవున్న సరోవరంవైపు చూశాడు. కదలుతున్న పిట్టల నించి ఎగురుతున్న చిరుచేపలు కూడా కనిపిస్తున్నాయి. తామరాకుల మధ్యలో తెల్లకలువ పువ్వులు, ఆ మధ్యలో పైకి పొడుచుకువచ్చిన ఎర్రకలువ మొగ్గలు. సరోవరం వెనుక ఎత్తుగా పెరిగిన చెట్ల సందులో నించి ప్రసరించిన సూర్యకిరణాలు రానురాను మాయమై పోయాయి. చెట్లపై నెలవంక నవ్వుతూనిల్చుంది. పైనరెండు నక్షత్రాలు. దిగువగా మళ్లీ ఈ అమ్మాయి రెండుకళ్ళూ కనిపిస్తున్నాయి.

ఒక రోజుకాదు, వారంరోజులు ఆ కళ్లవెలుగు, ఆ పెదిమల దరహాసం శివకుమార్‌మీద పడడంతో ఒకవిధమైన భావసంచలనం తనలో కలిగింది. ఆత్మపరితాపంనించి అంతోయింతో బయటపడక పోయిఉంటే అతను అంతరాత్రిమీద దిగువ భాగంలోని ఆర్తనాదం వినగలిగేవాడా?

రెండురోజుల క్రితంనించి వస్తుందనుకున్న వాన చప్పున ఈ అర్ధరాత్రిమీద దూసుకుని వచ్చింది. ఎప్పుడూ ఇలాంటి పరిస్థితిలో జరిగేటట్లుగానే కరంటు పోయింది. వర్షం వెలిపిరికొట్టకుండా బాల్కనీ వేపున తలుపులు, కిటికీలు వేసుకున్నా

**కి**టికీ నించి
రెండు కళ్ళు తెరి
తనవేపు చూస్తున్నట్లు
గమనించేడు. ఆ అమ్మాయి
పెదిమల్లో నెలవంక
దరహాసం కనిపించింది.



చిత్రాలు: ప్రభు

దిగువన ఎవరో మూలుగుతున్నట్లు శివకుమార్‌కు వినిపించింది. టార్చిలైటు పట్టుకుని క్రిందికి దిగాడు. వర్షంలో ముద్దగా తడిసిపోయి వణికిపోతూ గట్టిగా మూలుగుతున్న ఒక ఆడమనిషి కనిపించింది. ఏభై యేళ్లు దాటినా ఓ డబ్బయిదాటిన మనిషిలాఉంది. అక్కడ మరికాసేపు ఆమెఉంటే బ్రతకకపోవచ్చు. గబగబ మీదికివెళ్లి ఇంట్లోఉన్న బన్ను రొట్టి తెచ్చి ఇచ్చాడు. వద్దనకుండా గబగబా తినేసింది. కడుపు నిండినా ఇంకా చలికి తట్టుకోలేకపోతోందని గమనించాడు. చేయూతనిచ్చి నిల్చోబెట్టాడు. తనవెంట మెల్లగాపైకి ఆగిఆగి మెట్లు ఎక్కింది. ఇంట్లోకి వెళ్ళాక ఒక తువ్వాలు, ఒక లుంగీ ఇచ్చాడు. పళ్ళునిదువ్వటి ఇచ్చాడు. రెండోగదిలో అతిథులకు ఉన్న పరుపుమీద కప్పుకుని పడుకోమన్నాడు. నిద్రపోయేముందు ఆమె చేతులెత్తి "ఈ నమస్కారం చిన్నవాడివి-నీకు కాదు. నిన్నుకన్న తలిదండ్రులకు" అంది.

బాగా తెల్లారినా ఆవిడ లేవలేదు. ఏమైందోనని ఆత్రతగా తొంగితొంగి లోనికి చూశాడు. ఒళ్లంతా కప్పుకున్నా ముఖంకప్పుకోలేదు. సగంమూసిన కళ్ళ నించి జరుగుతున్నదంతా చూడగలుగుతోంది. మెల్లగా లేచింది. వెళ్లిపోడానికి కదులుతూ ఆగి "దేవుడు రెండుకళ్లు ఎందుకిచ్చాడు? ఒక కన్నుంటే లోకంచూడడానికి చాలదా? రెండోకన్ను యెదుటి వాళ్లకోసం. దానితో దయతో నన్నుచూసి చచ్చిపోతున్నదాన్ని బ్రతికించావు" అంది.

ఈమాటలు వినగానే ఈవిడెవరో అడుక్కునే ఆవిడ కాదని, శివకుమార్ ఆమె నీరసం బాగా తగ్గాకగానీ వెళ్లడానికి వీల్లేదన్నాడు. ఆవిడ ఆగిపోయింది. ఆమె స్నానంచేసేలోగా రెండుచీరలు కొని తెచ్చాడు. ఆ చీరలుపట్టుకుని సంతోషంతో సత్తువ వచ్చినట్లు నిల్చుంది.

కొనివచ్చిన రొట్టెను, అరటిపళ్ళను డైనింగుబల్ల మీద పెడ్తూ "ఇంతకీ నీపేరు చెప్పలేదు" అన్నాడు.

"బాబూ మనలో ఒకసామెత ఉంది. పేరుకి గంగాభవాని, తాగబోతే నీటిచుక్కలేదని.."

"భవానీఅమ్మా — రా..ఇద్దరం తిందాం" అని డైనింగుటేబులుమీద కూర్చోబెట్టాడు. కాస్సేపు మౌనంగాతిన్నాక "అమ్మా నాన్నా వూరికెళ్ళారా?" అని అడిగింది.

"నువ్వుపెట్టిన నమస్కారం వాళ్లు అందుకోలేరు."

"అయ్యోపాపం. ఇద్దరూ పోయారా? ఎన్నాళ్లయింది?"

పోయినవాళ్లగురించి ఇప్పుడెందుకమ్మా? ఉన్నవాడిని నేను. నీకష్టం తెలుసుకుంటే నాకష్టం పోగొట్టుకోగలనేమో?"

ఆత్రతగా తొంగి తొంగి లోనికి చూశాడు. ఒళ్ళంతా కప్పుకున్నా ముఖం కప్పుకోలేదు. సగం మూసిన కళ్ళనించి జరుగుతున్నదంతా చూడగలుగుతోంది.

ఆమె నిట్టూర్చింది. ఇంకేమీ చెప్పలేదు. ఆ పరిస్థితిలో ఆమెను అట్టేవేధించడం భావ్యంకాదని వూరుకున్నాడు. ఆమెతిన్నాక మళ్ళీ మంచంయెక్కింది. రెండురోజులు పోయాకగాని ఆమెకు అసలు సత్తువరాలేదు. శివకుమార్ వెన్నెలను తోడుచేసుకుని బాల్కనీలో కుర్చీమీద కూర్చుని ఉన్నాడు. ఒక కునుకుతీసిలేచిన భవాని ఇతన్నిచూసి దగ్గరగా వచ్చింది.

"వాడుకాదు...నువ్వే నాస్వంతబిడ్డలా కనిపిస్తున్నావు"



అనగానే ఇంకోకుర్చీ ముందుకు లాగి "రా కూర్చోఅమ్మా" అన్నాడు. భవాని కూర్చుంది.

"నీకు కొడుకు ఉండి నిన్ను ఇలా వీధిపాలు చేశాడా? ఎంచేత?"

"మనసుకూ గుండెకూ మధ్య ఉన్నతోవలో బంధాలు తెంపుకోడానికి బండరాయి అడ్డంపెట్టేసుకున్నాడు. రెండుకళ్ళున్నా ఒక్క కన్నుతో బతికేవాడు. నేనంటే వాడికి అసహ్యం. నా కొడుకని చెప్పుకుంటే వాడికి చిన్నతనం — నేనంటే వాడికి రోత..నన్ను వాడిపెళ్లం యెదరగానే చులకనచేసి నామీద నిప్పులు కక్కుతుంటే ఊరుకున్నాను. ఆనాడే పోయావనుకున్నాను. ఎందుకొచ్చావ్ ఛో — మళ్లీ నీ పాపిష్ఠిముఖం చూపించకు అన్నాడు. ఎవరినైనా చులకనచెయ్యి. ఆడదానిని చెయ్యకు. అందులో కన్నతల్లిని చెయ్యకురా అన్నాను. కన్నతల్లిప్రేమఅంటే ఏమిటో తెలిస్తేగా?"

"నీబ్రతుకు వివరంగా చెప్తావా!"

"స్వంతకొడుకు అమ్మా అని పిలవలేదు. నువ్వు పిలుస్తున్నావు. వాడు అసలు ఏంజరిగిందో వినదలుచుకోలేదు. నివ్వు వివరంగా వింటానంటే కాదనగలనా? ఇలా నా సొద నీయెదరగాకక్కేస్తే నా గుండెబరువు తగ్గిపోతుంది."

"చెప్పమ్మా చెప్పు" అని కుర్చీ దగ్గరగా జరిపాడు.

"మాఆయన అందరాని వస్తువునేదో ఆశించాడని నాకు పెళ్ళయినాకగానీ తెలుసుకోలేకపోయాను. నేనూ అసహ్యంగాలేనుకదా! నలుగురూ చక్కనిపిల్లే అనేవాళ్ళు. ఇది ఇష్టంలేనిపెళ్ళా పుసికిపోడానికి? అతనా బయటకు వినయసంపన్నుడు. లోన దుర్మార్గుడు. కలకాలం ఈ దుర్మార్గం ఉండిపోతుందా అని ఓర్చాను. ఇక ఇంట్లో బంధువులురావడం, నెత్తినెక్కడం? చీరలు పెట్టావా, సారెలు పెట్టావా అని గోల. అతగాడికీ ఆ అందరాని వస్తువుమీదే గౌరవం. నేనెంత అలంకరించుకున్నా దెయ్యంలా ఉన్నావనేవాడు. సర్వే డిపార్టుమెంటులో ఉద్యోగం. కొండలు సర్వేచేసినవాడు ఒకసారి ప్రేమప్రవాహంతో కొండలు కొట్టుకుపోయినట్లు ఆదరించేవాడు. ఇదంతా నిజమేఅని నమ్మాను. పేచీలుపెట్టి అతగాడి తల్లిదండ్రులకు దూరంచేసింది నేనేనని, నేను గడును పిల్లనని పేరేపడ్డాను. అసలు పేచీపెట్టింది అతను. దూరభారం బదిలీచెయ్యించుకుని వాళ్లతో సంబంధాలు తెంచుకున్నది అతను. నిష్ఠురం నా మీదపడింది. నాచేతికి డబ్బు ఇచ్చేవారు కాదు. ఆడవారిచేతుల్లో అర్థం దాగదని ఘోషించేవారు. ఇంట్లో పసిపిల్లడ్నివదిలి ఎక్కడికి వెళ్లేవారో ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితిలో వదిలిపోయారు. ఈవేళ వస్తారు, రేపువస్తారని ఆగిఆగి — నేనైతే ఆకలికి ఓర్చగలను — నా కొడుకు ఓరుస్తాడా? అప్పులెందుకు చేశారో నాకుతెలీదు. వాళ్ళు ఇంటిమీదపడి అసలు మొగుడికన్నా హెచ్చు వేధించుకుతిన్నారు. ఈ బేజారైన మనసుకు ఏంచేసినా సబబు అనిపించింది.

మరో వారంరోజులిలాఉంటే ముందు కొడుకు పోతాడు. కొడుకు ఏమైనా అయిపోతే నేనూ చచ్చిపోతాను. ఉన్నసామాన్లన్నీ అమ్మేశాక ఇంకోగతిలేక కొడుకు పాలకోసం ఒకే ఒకనికి తొందరలో ఆత్రతతో లొంగి పోయాను. అతను నాదీనస్థితిని చూసి నన్ను కొనుక్కున్నాడనుకున్నాను. కాదు..నన్ను గౌరవించాడు. నాబిడ్డను నాకట్టుకున్న మగడి చేతపెట్టే బతకడు. నన్ను గౌరవించిన ఈమగాడు నాబిడ్డను సహించ లేడు. ఒకప్పుడు నామగడు తిరిగివచ్చినా అతని ప్రక్కన చేరలేను. ఇవన్నీ ఆలోచించే సంతానంలేని ఒక కలిగిన ఇల్లాలికి నాకొడుకునిచ్చేశాను. ఆ ఊర్లో కాదు — నా మొగుడు తెలుసుకోలేని జాగాలో! ఇల్లు వదిలి వెళ్లిపోయాను. నా మొగుడు తిరిగి వచ్చాడు. కొన్నాళ్లకి మళ్ళీ పెళ్ళి చేసు కున్నాడు. బతికినన్నాళ్ళు నన్ను కులటగా చిత్రించాడు. ఆ చిత్రణ నాకొడుక్కి చేరే టట్లు చేసాడు...." అని ఆగిపోయింది. బహుశా భవాని అలిసిపోయి నట్లుంది.

కాస్సేపయ్యాక "మబ్బులొస్తాయి, విడిపోతాయి. కష్ట సుఖాలు అంతే. కానీ ఆడదానికి అన్ని అవస్థల్లో ఒక్క అవస్థ గర్వకారణం కదా! అదే తల్లిగా గుర్తించబడటం. ఆ గుర్తింపుకోసమే అన్నీపోగొట్టుకున్న నేను వాడిపంచన చేరాలని వెళ్లలేదు. ఇన్నాళ్ళు ఎదురు చూసినదాన్ని ఇంకెంతకాలమో బతకనను కున్నాను. చచ్చిపోయేముందు కొడుకును చూడాలన్న భ్రాంతి వాడి దగ్గరగా వెళ్లనిచ్చింది. పైనించి వాడి సంస్కారం చూశాక అర్థం చేసుకుంటాడని, నాయనా నీతండ్రి ద్వారా లోకంపూసిన మసిరాసిన నాముఖంచూడకు. కొడుకు బతకాలని మానంకూడా త్యాగంచేసిన ఒక మాతృముఖాన్ని చూస్తాడన్న ఆశతో యింట్లోకి వెళ్లాను. వాడు నామాట వినే స్థితిలో లేడే — అందుకే తిరుగుముఖం పట్టాను.. ఇలా నడుస్తూ నడుస్తూ ఈ వానలో చిక్కుకున్నాను.. అయితే.. నాకథ విన్నావు.. ఇకనువ్వు నాలో కులటను చూస్తావో? తల్లిని చూస్తావో?" అని ఆగిపోయింది.

శివకుమార్ తలప్రక్కకు త్రిప్పుకున్నాడు. నోటంట మాటరాలేదు. ఆమె కాస్సేపు ఆగి "మనుషులంతా రెండేజాతులు. ఆడా మగా. ఆడదాన్ని ఇంకో ఆడది, మగవాడు ఇంకో మగవాణ్ణి అర్థం చేసుకోవటం గొప్పకాదు. ఆడదాన్ని మగాడు, మగాడికి ఆడది ఒకరినొకరు విశ్వాసంతో అర్థం చేసుకుంటేనే అన్యోన్యతకి దారితీస్తుంది. అన్యోన్యతలేనిది లోకంలో యేమీ జరగదు. నీగదిలో కాలుపెట్టిన దగ్గరనించి చూస్తున్నాను నువ్వదోలా ఉన్నావు. మనసులో ఏదో బాధతో నలిగిపోతున్నావు. ఈ బాధ పోవాలంటే ఒకటేదారి — పెళ్ళికాకపోతే పెళ్ళిచేసుకో. పెళ్లం వదిలిపోయుంటే క్షమాపణచెప్పి తీసుకురా..."

చప్పున శివకుమార్ కళ్ళుతుడుచుకుంటూ లేచిపోయాడు. ఎందుకని ఆమె అడగలేదు. మెల్లగా నడిచి పరుపుమీద వాలిపోయాడు.

ఉదయం శివకుమార్ లేచేసరికి ఆమె వెళ్ళి పోవడానికి తయారయివుంది.

"అమ్మావెళ్ళిపోతావా? వారంరోజులుండకూడదూ?"

ఇంకో అడుగు ముందుకువేసి "వద్దునాయనా! ఇంకానేనుంటే నేను రాత్రిచెప్పినదంతా నీఅభిమానం పొందటానికి చిలవలు పలవలు చేసి చెప్పినట్లు అనిపిస్తుంది. చలితో, ఆకలితో చచ్చిపోతున్నదానిని

బతికించావు. నీతో నాకష్టాలు చెప్పుకోవడంతో నామనసులో బరువు దిగిపోయింది. ఈ పుంజుకున్న బలంతో ఇలా నడుస్తూపోతే కన్న బిడ్డచేత అమ్మా అని పిలిపించుకోలేకపోయినా— నీలాంటి ఎందరి బిడ్డలతో అమ్మా అని ఆప్యాయంగా పిలిపించుకుంటానో" అంది.

ఒక చిన్నినవ్వుతో దీవించి మెట్లుదిగి వెళ్ళిపోయింది. రెండురోజుల వరకు ఇంకా భవానీమాటలే మనసులో తిరుగుతున్నాయ్. ఆ కిటికీ నించి ఆ అమ్మాయి ఈరెండురోజులు ఏదో ఒక సమయంలో చూస్తూనేఉంది. భవానిచెప్పిన రెండుకళ్ళ ప్రయోజనం ఈ అమ్మాయి చూపుల్లో మెరుస్తున్నాయి. భవాని చివరగా ఇచ్చిన సలహాని పాటించాలని భీష్మించుకుని...ఆ సాయంత్రమే...ఆ యింటి కాలింగ్‌బెల్ నొక్కాడు. ఆ అమ్మాయి తలిదండ్రులున్నారు. అమ్మాయి ఏగదిలోనించి తనవేపుచూసేదో ఆగదిలో ఉంది. ఇక్కడి మాటలు అక్కడికి విని పిస్తాయి.

"నేనండి...శివకుమార్‌ని...ఆపైన చివరిఫ్లాటులో దిగాను..."

ఇంటి యజమాని చిన్నినవ్వుతో "తెలుసు...మీగురించి అంతా తెలుసు... కూర్చోండి" అంటూ కుర్చీ చూపించాడు. భార్యను కాఫీ తెమ్మన్నాడు. ఎలా అసలుమాట అనాలో ఆలోచిస్తుంటే, ఆవిడ కాఫీ కప్పు చేతపట్టుకుని సోఫాలోకూర్చుంది.

"మీతోవిషయం అడగాలని వచ్చాను" అన్నాడు.

"చెప్పండి"

"నేను ఎలక్ట్రానిక్ ఇంజనీరుని. మంచి ఉద్యోగంలో వున్నాను. ఈరోజుల్లో సంబంధాల విషయంలో ఇవి ప్రధానపాత్ర వహిస్తున్నాయని చెప్తున్నానుగానీ — ఇవి నావ్యక్తిత్వాన్ని పెంచేవని చెప్పలేదు".

"ఎక్కడైనా సంబంధం చూసి పెట్టాలా?" అన్నాడాయన నవ్వుతూనే.

"ఇంకెక్కడో అయితే నేను మీఇంటికి ఇలావచ్చే అవసరం ఉండదు. మీఇంటి అల్లుడయ్యే అవకాశం ఉందేమోనని వచ్చాను" అన్నాడు వినయంగా.

"వీల్లేదు".

"మీ అమ్మాయికి సంబంధం కుదిరిపోయిందా?"

"లేదు"

"సంశయించడానికి ఇంకేమైనా కారణంఉందా?" "ఒక నెలరోజుల క్రితం నువ్వు వచ్చి అడిగి ఉంటే కళ్ళకు అద్దుకుని నిన్ను అల్లుడ్ని చేసుకునేవాడ్ని..కాని ఇప్పుడు...?"

"మీ సంశయం ఏమిటో చెప్పండి." అనగానే అతను కారణం చెప్పడానికి మొగమాట పడుతుంటే అతనిభార్య నిస్సంకోచంగా- "ఆ రామేశ్వరావు, రాజేశ్వరి నీ అసలు తల్లిదండ్రులు కారని ఈ మధ్యే తేలి పోయిందికదా..."

"అంతమాత్రాన పెంచిన మమకారాలు పోతా యండీ" "కన్నకొడుకు మీదనున్న మమకారం పెంపుడు కొడుకుపై ఉంటుందా? వాడికన్నా నీవు తెలివైన వాడివని ఇన్నాళ్ళూ నిన్ను ఆదరించారు. వాళ్ళు తెచ్చిన సంబంధంకాదన్నావని వాళ్ళ చెప్పుచేతుల్లోలేవని నిన్ను వదులుకుంటూ నీగుట్టు తెలి సారిగా బయట పెట్టేశారుగా! నీ తల్లి హీనమైన చరిత్ర విన్నవాళ్ళెవరు నీకు వాళ్ళకూతుర్ని ఇవ్వ గలరు చెప్పు?"

నెల రోజులక్రితం యెప్పుడైతే పెంపుడు తల్లి నోట తను తన అసలు తల్లికాదని విన్నాడో అప్పుడే, అసలు తల్లిగురించి నిలదీసి అడిగాడు. రాజేశ్వరి ఇతని అసలుతల్లి కులటని, అమాయకుడైన తండ్రి నివదలి ఒక విటునితో లేచిపోయిందని ఊరంతా వినిపించేట్లు అరిచింది. వాళ్లెక్కడంటే నరకంలో ఉంటారంది. అతను వాళ్ళ ఇంటినించి బయటపడి ఈయింట్లోదిగి కన్నతల్లిని అసహ్యించుకుంటూ స్వగతంలో పడ్డాడు. చప్పున శివకుమార్ కళ్ళెదుట భవాని ప్రత్యక్షమైంది. తన స్వంతతల్లి ఎలావుండేదో తనకి తెలియదు. ఈ భవాని రూపే తన తల్లి రూపుగా మనసంతా అల్లుకుంది.

"మీరు నాస్వంత తల్లిదండ్రుల జీవితం

> "ఇప్పుడు గర్వంగా బ్రతుకు తున్నాను. అందుకే మీ అమ్మాయిని నా తోడు నీడగా ఇస్తారా అని అడగడానికి వచ్చాను."



గురించి విన్నారు కానీ నేను మొన్నరాత్రే మా అమ్మ మహోన్నతమైన మాతృత్వం గురించి తెలుసుకున్నాను. విన్నదానికి, తెలుసుకున్నదానికి చాలాతేడా ఉంటుంది. ఎంచేతంటే విన్నది పూర్తి నిజంకాదు. నోరుమారితే, మాటమారుతుంది. కన్నదీ తెలుసుకున్నదీ మాత్రం పూర్తి నిజం. నా దృష్టిలో నాతల్లి మాతృదేవత. కొడుకు బతకాలని సర్వస్వం ధారపోసింది. మొన్నటివరకు మా అమ్మని అర్థంచేసుకోక బ్రతుకుతూనే చచ్చాను. అర్థంచేసుకున్నాక ఇప్పుడు గర్వంగా బ్రతుకుతున్నాను. అందుకే మీ అమ్మాయిని నాతోడు నీడగా ఇస్తారా అని అడగడానికి వచ్చాను."

"ఒక ముద్ర పడిందెప్పుడో. చెరపలేం. అందుకే మాకు ఇష్టంలేదు" అని తండ్రి తెంపేశాడు.

"ఆ ముద్ర తప్పుడు ముద్ర అని చెరిపేసి నాకు పిల్లనిచ్చేవారులేరని కాదు మీ ఇంటి కొచ్చింది?"

"మరెందుకొచ్చావ్?" అని ఆవిడ కటువుగా ప్రశ్నించింది.

"నాపెంపకం తల్లిదండ్రులు ఒక్కసారి జలపాతంలోకి తోసేస్తే నన్ను చావకుండా బ్రతికించింది మీ అమ్మాయి. ఈలోకాన నాకెవ్వరూ లేరనుకున్నప్పుడు రెండుచుక్కల్లాంటి ఆమె కళ్ళల్లోంచి ప్రసరించే వెలుగు, ఆ వెలుగు అందించిన సానుభూతి నన్ను బ్రతకనిచ్చింది. సరే మీరు కాదంటున్నారు. ఒకసారి మీ అమ్మాయిని అడక్కూడదూ?"

"మా మాటే మా అమ్మాయిమాట" అంటూ ఆమె లేచిపోయింది.

"మీ అమ్మాయి మనసులోని మాటనైనా తెలుసుకో కుండా నిర్ణయం తీసుకుంటారా?" అన్నాడు లేచిపోతూ శివకుమార్.

ఒక అడుగుముందుకువేసి వెనుతిరిగిచూస్తే లోపలిగది గుమ్మందగ్గర ఈ మాటలన్నీ వింటున్న అమ్మాయి కళ్ళకదలికతోపాటు, ఆగమన్నట్లు సైగ చేసింది. చప్పున వెనుతిరిగాడు.

"పోనీ ఒకసారి మీ యెదరగా మీ అమ్మాయిని నన్ను అడగనిస్తారా?".

"బాబు మాకెందరుపోయారు? ఇది క్కత్తే. నీకుమించిన సంబంధం, సంప్రదాయ కుటుంబంనించి తెచ్చుకుంటాం. ఇవ్వనూ అంటే ఏమిటి బలవంతం?" అని ఆమె విసుక్కుంటుంటే, శివకుమార్ కదలకుండా నిలుచున్నాడు. పిల్లతండ్రి కోపం బయటకు కక్కలేదు. ముగ్గురు కొద్దినిము షాలు మౌనంగా ఎవరిదృష్టి వాళ్ళదన్నట్లు చూసుకుంటున్నారు. అడుగులో అడుగు వేసుకుంటూ కూతురు సృజన డ్రాయింగ్ రూంలోకి వచ్చింది.

"మీరు ఆయనగురించి విన్నారు. నేను ఆయనను ఈ వారం రోజుల్లో తెలుసుకున్నాను."

"ఏమిటి తెలుసుకున్నావే? అతనితో షికార్లెళ్ళావే?" తల్లి కఠోరంగా ప్రశ్నించింది.

"మనిషిని తెలుసుకోవడానికి షికార్లెళ్ళక్కర్లేదమ్మా మనిషి ప్రవర్తన.."

"ఏం చూశావే అతని ప్రవర్తన?"

"క్రిందటివారం. అర్ధరాత్రి ఒక అనాథ స్త్రీ చలిలో చావడానికి సిద్ధంగా ఉండి మూలుగుతూ ఉంటే క్రింది అంతస్థులోఉన్న మన ముగ్గురం విన్నాం. తలుపులు తీసి లోపలికి రప్పించామా? పై అంతస్థులోనున్న అతను క్రిందికిదిగి, ఆమెను ఆదరించి బ్రతికించి తిండి, బట్ట పెట్టి మళ్ళీ మామూలు మనిషినిచేసి పంపించారు. తప్పక ఇతను పూజింపదగిన ఒక మాతృదేవత సంతానం. నాకు పెళ్ళి అంటూ జరిగితే ఇతనితోనే జరుగు తుంది" అంటూ అక్కడినించి లోపలకి వెళ్లిపోయింది. ●